
ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ సలాం షాహిద్‌మూన్

ఎంఐఎం ఇంటింటి ప్రచారం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో హైదరాబాద్ ఎంపీ ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం సాయంత్రం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని బోదెలి షా కిడికి, పార్థివాడ, ఫర్హత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంఐఎంకు ఓటు వేసి ఎంపీగా అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చావునీ డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్ మూన్, ఎంఐఎం ఆజంపుర డివిజన్ అధ్యక్షుడు షేక్ మొహియుద్దీన్ అబ్రార్, సయ్యద్ అలీం, ఎమ్మార్పీఎస్ మలక్‌పేట అధ్యక్షుడు గడ్డం నరేందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.


హనుమాన్ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హనుమాన్ జయంతి శోభాయాత్రను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వనస్థలిపురంలో భారీ ఎత్తున నిర్వహించే హనుమాన్ జయంతి శోభాయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం హనుమాన్ జయంతి శోభాయాత్ర వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 23 మంగళవారం సాయంత్రం 4గంటలకు వనస్థలిపురం గురుద్వార్ సమీపంలోని రామాలయం నుంచి ప్రారంభమయ్యే హనుమాన్ శోభాయాత్ర ఎన్జీవోస్‌కాలనీ మీదుగా సాహెబ్‌నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయస్వామి ఆలయం వద్ద ముగుస్తుందన్నారు. హనుమాన్ భక్తులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గొని శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.


బీజేపీ ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

ఈటల రాజేందర్‌ను గెలిపించాలి: కార్పొరేటర్

చంపాపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఓటర్లను కోరారు. చంపాపేట డివిజన్‌లోని కుమ్మరిబస్తీ, కటికోనికుంట, ఏడబస్తీ, మారుతీనగర్‌కాలనీలలో గురువారం కార్పొరేటర్ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలం పువ్వుగుర్తుకు ఓటేసి ఈటలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, లింగాల దశరథ్‌గౌడ్, పాశం శ్రీశైలం, టింగ్లీకర్ రాజేష్, సిల్వేరు అనిల్‌కుమార్, భానుక రమేష్ పాల్గొన్నారు.


వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, కాలనీవాసులు

వాకింగ్ ట్రాక్‌లను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడే వాకింగ్ ట్రాక్‌లను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్ రోడ్డు నం.1లోని చిల్డ్రన్స్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా వాకింగ్ పార్కును కాలనీవాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తగిన సమయాన్ని కేటాయించాలన్నారు. మహిళలు తమ ఆరోగ్యాలను కాపాడుకోవడానికి వాకింగ్ ట్రాక్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి పి.మాధవరెడ్డి, సలహాదారులు ఎం.లక్ష్మారెడ్డి, కృష్ణారావు, సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి పెమ్మసాని వెంకటేశ్వర్లు, డాక్టర్ పద్మాంజన్ ఆబు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.


సీపీఐ కార్యాలయం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్‌లో సీపీఐ కార్యాలయం ప్రారంభం

హయత్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గం హయత్‌నగర్‌లో సీపీఐ నూతన కార్యాలయాన్ని గురువారం ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ఎంపీ ఎన్నికలు దేశ భవిష్యత్‌కు బాటలు వేసేవని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఉండాలా.. నియంతృత్వం ఉండాలా ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని దీంతో పౌరులు ప్రాథమిక హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి చాయాదేవి, హయత్‌నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు శ్రీదేవి, సక్రునాయక్, సుజాత, సరిత, పారిజాత, అనిత, జ్యోతి, సౌజన్య, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల ఊరేగింపు

చంపాపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో బుధవారం రాత్రి సీతారాముల రథయాత్ర ఊరేగింపు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి గరుడ వాహన తిరువీధి ఉత్సవం కనుల పండువగా కొనసాగింది. భక్తుల భజనలు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ జనంలోకి వెళ్లాలి

● **మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి**

కొత్తపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ జనంలోకి వెళ్లాల్సిన తరుణం ఆసన్నమైందని ఇక సమావేశాల నిర్వహణ సరికాదని మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నాగోల్‌లోని అనంతుల రాంరెడ్డి గార్డెన్స్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హయత్‌నగర్, మన్సూరాబాద్, నాగోల్ డివిజన్ల కార్యకర్తలు, నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడారు. ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారెంటీలు, 5 న్యాయాలు - కాంగ్రెస్ హామీలను ప్రస్తావించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండూ ఒక్కటేననే అంశాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు.

మిషన్ 15 లక్ష్యంగా ముందుకు..

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాలతో మిషన్ 15 లక్ష్యంగా 15 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఎంపీ అభ్యర్థి సునీతారెడ్డికి అపారమైన అనుభవం ఉందని, చేవెళ్లను వదిలి మల్కాజిగిరి నుంచి పోటీ ఛాలెంజ్‌గా తీసుకుని వచ్చిందని పేర్కొన్నారు. మల్కాజిగిరి దేశంలోనే అతిపెద్ద ఎంపీ నియోజకవర్గమని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం అవశ్యంగా గుర్తించాలని అభిప్రాయపడ్డారు. సమ్మేళనంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామ్మోహన్‌గౌడ్, ఈశ్వరమ్మయాదవ్, అనంతుల సురేందర్‌రెడ్డి, డివిజన్ల పార్టీ అధ్యక్షులు, బుడ్డ సత్యనారాయణ, మంజులారెడ్డి, చిరంజీవిగౌడ్, భవానీశంకర్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పట్నం సునీతామహేందర్‌రెడ్డి

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

చంపాపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు, చెయ్యిగుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని అంబేడ్కర్‌వాడలో గురువారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డితో కలిసి సునీతామహేందర్‌రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు మెట్టు వెంకట్‌రెడ్డి, కృష్ణాయాదవ్, యాదగిరి, ఖాదర్, బస్తీవాసులు సంజన్న, హుస్సేన్, దేవరాజ్, రాజు, కృష్ణ, మల్లన్న పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

● **టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్**

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని గణేష్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన గడ్డిఅన్నారం, చైతన్యపురి, కొత్తపేట డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా నిలవాలని విన్నవించారు.


మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్

కాంగ్రెస్ నాయకుడు ఎస్వీ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మార్గం లక్ష్మీశ్రీనివాస్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ వారికి కాంగ్రెస్ కడువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వందరోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు

● **టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జిలు నిజాముద్దీన్, నేరెళ్ల శారద**

ఎల్బీనగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వందరోజుల్లోనే ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జిలు నిజాముద్దీన్, నేరెళ్ల శారద అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని తెలంగాణ ఫంక్షన్ హాల్లో ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలన పట్ల ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు. అదే క్రమంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అమలు చేసిన హామీల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ సమ్మేళనంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, కాంగ్రెస్ నాయకులు నందిగామ నర్సింహ, యువజన కాంగ్రెస్ నాయకులు రమేష్‌నేత, యాదయ్య, లింగస్వామిగౌడ్, పగడాల ఎల్లయ్య, జ్ఞానేశ్వర్‌యాదవ్, రాజునాయక్, అక్బర్, కల్యాణ్, సురేష్, సుజాతరెడ్డి, సలీం, శైలజరెడ్డి, సరస్వతి, రేణుక, లక్ష్మి, శ్రీశైలం, శ్రీనాథ్ పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో దేప భాస్కర్‌రెడ్డి, నిజాముద్దీన్, నేరెళ్ల శారద

ఓయూలో టెక్నోస్మానియా - 2024 ప్రారంభం

తార్నాక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో మూడు రోజుల జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియా- 2024 గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఓయూ వీసీ డా.రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి టెక్నో ఫెస్ట్ వంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఉన్న అంతర్గత శక్తిని వెలికితీయడంతో నాయకత్వ లక్షణాలను పెంపొందింపజేస్తాయన్నారు. అనంతరం టెక్నాలజీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.చింత సాయిలు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించే జాతీయ టెక్నో ఫెస్ట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు పాల్గొని తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం కన్వీనర్ ప్రొ.ఎస్. శ్రీనునాయక్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. వి.రమేష్ కుమార్, ఆర్. శ్యామ్ సుందర్, ప్రొ. వి.వి. బసవరావు, ప్రొ. ప్రభాకర్ రెడ్డి, ప్రొ. బి.రాజం, ఫ్యాకల్టీ కో- ఆర్డినేటర్ డా. ఏ.పరశురాములు, డా.పరమేశ్వర్లు, డా.సాదం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు సరిగా లేవని ఆందోళన

సైదాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ బాలాజీనగర్‌లో నూతన రోడ్డు నిర్మాణ పనుల అస్తవ్యస్తంపై కాలనీవాసులు గురువారం ఆందోళనకు దిగారు. కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకుండా తమ ఇంటి ర్యాంపులను కూల్చివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు నేతల ఆదేశాలతో కక్ష్యపూరితంగా కొన్ని ఇళ్ల ముందు మాత్రమే ర్యాంపులను కూల్చివేశారని ఆరోపించారు. సదరు కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరించారని తెలిపారు. నిర్మాణ పనులపై విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి కాలనీవాసులతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజులలో సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీతో ఆందోళన విరమించారు. కార్పొరేటర్ చెప్పడంతో ఆందోళన తాత్కాలికంగా వాయిదా వేసుకుంటున్నామని బాధిత కాలనీవాసి నరేందర్‌యాదవ్ తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే జీహెచ్ఎంసీ కమిషనర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు కరుణాకర్‌రెడ్డి, దిలీప్, ప్రతాప్, బాబులాల్, శేఖర్ రెడ్డి, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న బాలాజీనగర్ వాసులు

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

వనస్థలిపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్‌లోని సోమనాథక్షేత్రంలో ఆది పరాశక్తి స్వరూప క్రీం బీజాక్షర మహాకాళి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఈనెల 19 (నేటి) నుంచి 21 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కౌశిక్ మహర్షి తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో కౌశిక్ మహర్షి మాట్లాడుతూ మహా తపస్వీ పూజ్య గురుదేవులు సోమనాథ మహర్షి ఆశీస్సులతో సోమనాథ క్షేత్రంలో ఈనెల 21న ఆది పరాశక్తి స్వరూప క్రీం బీజాక్షర మహాకాళి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహిస్తున్నామని, కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఫోన్‌లో దూషించినందుకు రౌడీషీటర్‌పై దాడి

● **డీసీపీ కార్యాలయానికి పరుగులు పెట్టడంతో నిందితుల పరారీ**

సైదాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో దూషించిన రౌడీషీటర్‌పై మరో రౌడీషీటర్ ఇద్దరు కుమారులు, బాలుడితో కలిసి కత్తులు, రాడ్‌తో దాడి చేయడంతో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సైదాబాద్ చౌరస్తా సమీపంలో రౌడీషీటర్ నసీర్ అలియాస్ చాకు నివాసముంటూ వెహికల్ రికవరీ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారం విషయంలో బాలాపూర్ పీఎస్ పరిధిలోని రౌడీషీటర్ సయ్యద్ జావిద్ అలీ కుమారులు నసీర్‌కు ఫోన్ చేయగా పరుష పదజాలంతో దుషించాడు. దీంతో గురువారం తెల్లవారుజామున జావిద్‌అలీ ఇద్దరు కుమారులు, మరో బాలుడితో వచ్చి నసీర్‌పై కత్తులు, రాడ్‌తో దాడి చేశారు. దీంతో నసీర్ సమీపంలోని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయానికి పరుగులు పెట్టాడు. కొద్ది దూరం వెంబడించి నిందితులు పారిపోయారు. నిందితులు బాలాపూర్ పీఎస్ రౌడీషీటర్ సయ్యద్ జావిద్‌అలీ కుమారులు సయ్యద్, అసీఫ్, సయ్యద్ మున్నా, షాహీన్‌నగర్‌కు చెందిన ఓ బాలుడు(17)గా పోలీసులు గుర్తించారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు తిరిగి ఇవ్వలేదని కత్తిపోట్లు

సంతోష్‌నగర్ : ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఐఎస్‌సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేట ప్రాంతానికి చెందిన సాయికుమార్(26) కార్ల క్రయ విక్రయాల వ్యాపారం చేస్తుంటాడు. కాగా సాయికుమార్ 2022 సంవత్సరంలో తన సోదరి వివాహం కోసం తన పెద్దనాన్న శ్రీశైలం కుమారుడైన మహేష్‌కుమార్ (కానిస్టేబుల్) వద్ద రూ.2లక్షలు 4శాతం వడ్డీకి తీసుకున్నాడు. అప్పటి నుంచి సాయికుమార్ తీసుకున్న డబ్బులకు వడ్డీ చెల్లిస్తూ ఉన్నాడు. కాగా మహేష్‌కుమార్ అసలు డబ్బులు ఇవ్వాలని సాయికుమార్‌ని కొన్ని రోజులుగా ఒత్తిడి తెస్తున్నాడు. ఇందులో భాగంగా గురువారం మహేష్‌కుమార్ బడంగ్‌పేటలో ఉంటున్న సాయికుమార్ ఇంటికి వెళ్లి డబ్బుల విషయం మాట్లాడుకుందామని సాయికుమార్ కారులో మాదన్నపేటలోని చంద్రయ్య హట్స్‌లోని తన ఇంటి వద్దకు చేరుకున్నారు. అక్కడ డబ్బుల విషయమై మాట్లాడుతుండగా చిన్నపాటి గొడవ జరిగి మాటా మాటా పెరగడంతో మహేష్‌కుమార్‌తో పాటు తండ్రి శ్రీశైలం, సోదరుడు జగదీష్‌లు సాయికుమార్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటనలో తీవ్రగాయాలైన సాయికుమార్‌ను చికిత్స నిమిత్తం సైదాబాద్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు ఐఎస్ సదన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్రగాయాలైన సాయికుమార్

బీఎస్పీకి 'కొత్త' రాజీనామా

● **త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటన : మనోహర్‌రెడ్డి**

సరూర్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే(2014లో టీఆర్ఎస్ నుంచి, 2023లో బీఎస్పీ తరఫున పోటీ చేశారు) కొత్త మనోహర్‌రెడ్డి బహుజన్ సమాజ్ పార్టీకి రాజీనామా చేశారు. తన భవిష్యత్ రాజకీయ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తానని ఆయన పేర్కొన్నారు. గురువారం మంద మల్లమ్మ చౌరస్తాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వల్ల తాను బీఎస్పీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో బీఆర్ఎస్‌లో కొనసాగిన ఆయన.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం తనకు మహేశ్వరం టికెట్ దక్కకపోవడంతో రేవంత్‌రెడ్డిపై టికెట్ల విక్రయం ఆరోపణలు చేసి వార్తల్లోకి ఎక్కారు. దాంతో ఆయనను డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అనంతరం ఆయన బీఎస్పీలో చేరి మహేశ్వరం టికెట్ దక్కించుకుని ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి మౌనంగా ఉంటున్న మనోహర్‌రెడ్డి.. గురువారం సడన్‌గా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తాను బీఎస్పీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం! కాగా తాను ఏ పార్టీలో చేరాలన్నది తన అనుచరగణంతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు.


బీఎస్పీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటిస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

విద్యార్థి మృతి ఘటనపై విచారణ జరపాలి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఎస్సీ గురుకుల పాఠశాల భువనగిరిలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై విద్యార్థి మృతిచెందిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్‌ను మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరేళ్ల మహేష్‌కుమార్‌తో కూడిన బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఎస్సీ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని దాదాపు 20మంది అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ఇందులో ఓ విద్యార్థి మృతి చెందినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎస్సీ సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని వారు ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనకు బాధ్యులైన అధికారులు, వార్డెన్ ఇతర సిబ్బందిపై చట్టపరమైన చర్యలు చేపట్టి ఇక ముందు ఇలాంటి ఘటనలు తలెత్తకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.


ఎస్సీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రభాకర్, మహేష్‌కుమార్

విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: మల్లేష్

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో ప్రాణాలు కోల్పోయిన 6వ తరగతి విద్యార్థి ప్రశాంత్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో తరచు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. చనిపోయిన విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ. 50లక్షల పరిహారం అందించాలన్నారు. గురుకుల పాఠశాలలో సైకాలజిస్టును నియమించాలన్నారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి బలవన్మరణం

అంబర్‌పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో క్యాబ్ డ్రైవర్, కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఎలక్ట్రీషియన్ బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. అంబర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారెడ్డినగర్‌లో నివసిస్తున్న ఖాజామీయా కుమారుడు మన్సూర్ అహ్మద్(29) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో అప్పులు చేశాడు. తీర్చలేక కొంతకాలంగా ఆందోళన చెందుతున్నాడు. గురువారం ఇంట్లో చున్నీతో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో..

బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిపల్లి వద్ద నివసిస్తున్న సయ్యద్ నహీమ్(28) ఎలక్ట్రీషియన్. రెండేళ్ల క్రితం నేహా ఫాతిమాతో అతడికి వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన నహీమ్ గురువారం వట్టిపల్లి రైల్వే గేట్ వద్ద ఎంఎంటీఎస్ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. 'తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, ఎవరిపైనా కేసు పెట్టవద్దని, జీవితంపై విరక్తి చెంది చనిపోతున్నానని' సెల్‌ఫోన్‌లో వీడియో రికార్డు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

కవాడిగూడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ, ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లిన యువతి కనిపించకుండాపోయారు. బండైసమ్మనగర్‌లో నివసిస్తున్న ఎం. నవీన(28) ఇందిరా పార్కు సమీపంలో ఓ ఇంట్లో పనిచేస్తోంది. ఈనెల 10వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త శ్రావణ్‌కుమార్ గురువారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నవీన

ఆస్పత్రికి వచ్చిన యువతి..

బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన యువతి అదృశ్యమైంది. ఆజంపురలో నివసిస్తున్న నాగేశ్వర్‌రావు కుమార్తె ఎన్. మేఘన(24) అనారోగ్యం బారిన పడడంతో తండ్రి గురువారం చప్పల్‌బజార్‌లో ఎస్వీఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వాష్‌రూమ్‌కు వెళ్లిన మేఘన తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి నాగేశ్వర్‌రావు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాద చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఎన్. మేఘన